


## రాముడి పేరుతో రాజకీయం చేస్తారు..

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



ఖమ్మం
మంగళవారం | 18 | మార్చి | 2025 ▪ పేజీలు:7

# రామ క్షేత్రాన్ని పట్టించుకోరు..!

### రాజ్యసభలో రైల్వే సమస్యలపై ధ్వజమెత్తిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** రాముడి పేరుతో రాజకీయం చేసే ఎన్డీఏ ప్రభుత్వం.. అదే రాముడు నడయాడిన భద్రాచల క్షేత్రంతో పాటు, తెలంగాణలోని రైల్వే సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉప నేత వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. సోమవారం రాజ్యసభలో బడ్జెట్లో రైల్వే శాఖ కు కేటాయించిన నిధులపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన తెలంగాణ కు సంబంధించిన పలు రైల్వే సమస్యలను ప్రస్తావించారు. 'రఘుపతి రాఘవ రాజారామ్' అనే రాముడి కావ్యంతో చర్చను ప్రారంభించిన ఆయన దక్షిణ అయోధ్య గా పిలవబడే భద్రాచలం క్షేత్రానికి రైలు మార్గం అనుసంధానించే భద్రాచలం - కొవ్వూరు రైల్వే లైన్ దశాబ్దాల నుంచి కలగా ఉంటోందని, ఈ కల సాకారం కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారని చెప్పారు. భద్రాచల క్షేత్రం ప్రాశస్త్యాన్ని గుర్తించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, జిల్లాల పునర్విభజనలో కొత్తగూడెం జిల్లాకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాగా నామకరణం చేసి రాముడి పై తనకున్న అపార భక్తిని చాటుకున్నారని గుర్తు చేశారు. రైల్వే ఆదాయానికి అధిక శాతం నిధులు సమకూరుస్తున్నా.. తెలంగాణ లో పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల కు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయడం లేదని వాపోయారు. ఉత్తర, దక్షిణ భారత దేశానికి ప్రవేశ ద్వారంగా ఉన్న ఖాజీపేటను రైల్వే డివిజన్ గా గుర్తించాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉందన్నారు. దక్షిణ మధ్య రైల్వేకు 48 శాతం ఆదాయం సమకూరుస్తున్న ఖాజీపేటను ప్రత్యేక డివిజన్ గా గుర్తిస్తే.. లాభదాయకంగా ఉంటుందని రవిచంద్ర ప్రస్తావించారు. సిద్దిపేట జిల్లాలో చిన్న కోడూరు రైల్వే స్టేషన్ మంజూరు, నిజామాబాద్, మంచిర్యాల, భద్రాచలం రోడ్ నుంచి తిరుపతికి నూతన రైలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ లో రైల్వే మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణంలో ఉన్న రైల్ ఓవర్ బ్రిడ్జి పనుల వేగవంతం, కొత్త బ్రిడ్జిల మంజూరు, రైల్వే స్టేషన్లలో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాల కల్పనపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని రవిచంద్ర కోరారు.

# ఖమ్మం మధ్య గేటు వద్ద అండర్ పాస్ కు రైల్వే మంత్రి హామి

### ఎంపీ రవిచంద్ర వినతికి సానుకూల స్పందన

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** ఖమ్మం నగరంలోని రైల్వే మధ్య గేటు సమస్యకు శాశ్వత పరిష్కారానికి హామీ లభించింది. ఈ మేరకు రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సోమవారం పార్లమెంటులో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసారు. మధ్య గేటు ప్రాధాన్యత, వ్యాపార, వాణిజ్య సంబంధాలు, రెండు పట్టణ ప్రాంతాల కలయిక తదితర అంశాలపై ఆయన రైల్వే మంత్రికి సోదాహరణంగా వివరించారు. ఎంపీ రవిచంద్ర విజ్ఞప్తి కి సానుకూలంగా స్పందించిన మంత్రి మధ్య గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణం పై సాధ్యాసాధ్యలను -మిగతా 5లో



## మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**కారేపల్లి, మార్చి17, ప్రజా జ్యోతి :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మహిలల అభివృద్ధికి పెద్దపీట వేసిందని వైరా శాసనసభ్యులు మాలోత్ రామదాసు నాయక్ అన్నారు. మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి అనే నినాదంలో భాగంగా ఇందిరా మహిళా పథకం సింగరేణి మండల (సెర్ప్) విజేత మహిళా సమైఖ్యా అందజేసిన రుణంతో వెన్నెల గ్రామ సమైక్య, పెద్దమ్మ తల్లి ఎస్ హెచ్ జి గ్రూపు సభ్యురాలు కంచి నాగలక్ష్మికి కేటాయించిన స్త్రీ టీ స్టాల్ ను సోమవారం వైరా శాసనసభ్యులు మాలోత్ రామదాసు నాయక్ ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి హాజరైన రాందాసు నాయక్ కు మహిళలు ఘన స్వాగతం పలికి హారతులు పట్టారు. స్త్రీ టీ స్టాల్ ను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం -మిగతా 6లో



# కూసుమంచి రోడ్డు అద్దెకివ్వబడును..!

**కూసుమంచి, మార్చి 17 (ప్రజా జ్యోతి) :** ఎక్కడైనా రోడ్డు పక్కనే స్థలం ఉంటే ఎవరైనా ఏమి చేస్తారు? బాగా విశాలముగా ఉన్నది అని వాడుకొనుట లేదా పార్కింగ్ కోసం వాడతారు కానీ కూసుమంచి రూట్ సపరేట్. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు విస్తరించి ఉన్నది. దాదాపు రెండు కిలోమీటర్లు పైగా ఉండే ఈ రోడ్డు ఇరువైపులా సహజంగా ఎన్నో షాపులు విస్తరించి ఉన్నాయి. వాస్తవానికి మెయిన్ రోడ్డులో ఎవరి షాపు ముందు ఉన్న ఖాళీ స్థలాన్ని వాళ్ళు ఉపయోగించుకోవడానికి చూస్తారు. దీనికి బదులు షాపు యజమానులు తోపుడు బండ్లకు, హొటల్స్ కు, చిన్న చిన్న బడ్డీ కొట్లు పెట్టుకోవడానికి అద్దెకిస్తున్నారు. వాళ్లది కానీ మెయిన్ రోడ్డు ని ఇతరులకు అద్దెకిచ్చి ఆదాయం సంపాదిస్తున్నారంటే ఈ వ్యాపారస్తుల తెలివితేటలు చూసి నోటి మీద వేలేసుకోవాల్సిందే కూసుమంచి ప్రజలు. పట్టణంలో ఉన్న ఈ మెయిన్ రోడ్డు చాలా విశాలంగా ఉంటుంది కానీ ప్రస్తుతం ఒక బస్సు వెళితే దాని పక్కన ఇంకొక బైక్ కూడా సౌకర్యంగా వెళ్లలేని దుస్థితి నెలకొన్నది.

### మెయిన్ రోడ్ విస్తరణకు సంశయం ఎందుకు ?

దీనికి కారణం మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న షాపు యజమానులు, బిల్డింగ్ ఓనర్స్, రోడ్డును పూర్తిగా ఆక్రమించేశారు. ఈ రోడ్డును ఒక్కసారి పరిశీలిస్తే విషయం అందరికీ అర్థం అవుతుంది.పట్టణంలో ఉన్న ఆక్రమణలు నిర్మూలించాల్సిన ఆర్ అండ్ బి, మండలాధికారులు నిద్ర నటిస్తున్నారు. ఆర్ అండ్ బి ఏ ఈ, మండల అధికారులు రోజు కూసుమంచి సెంటర్లో తిరుగుతుంటారు కానీ ఇవేవీ వారికి కనిపించకపోవడం విడ్డూరంగా ఉంది. ఎప్పుడైనా ఏదైనా యాక్సిడెంట్ అయితే రోడ్డు చిన్నదిగా ఉంది అందుకే ఆక్సిడెంట్ అయ్యింది అని చెప్పేవారే కానీ రోడ్డు ఆక్రమణలు తొలగించేవారు లేకపోవడం విచారకరం. పట్టణ శివారులో కొత్తగా ఏర్పాటు అయినా - మిగతా 4లో



## పరీక్షా సామగ్రి వితరణ



**కల్లూరు, మార్చి 17 (ప్రజా జ్యోతి) :** బత్తులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి పదవ తరగతి పరీక్ష రాయబోయే విద్యార్థులకు సత్తుపల్లి శాసన సభ్యులు డాక్టర్ మట్టా రాగమయి పరీక్షా సామాగ్రినీ తమ అనుచరుల ద్వారా సోమవారం అందజేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మధు మాట్లాడుతూ బాగా చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు గ్రామానికి కల్లూరు మండలంలో గొప్ప పేరు తీసుకురావాలని అలాగే పరీక్షా సామాగ్రి వితరణ చేసిన ఎమ్మెల్యే మట్టా రాఘమయి కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ నాయకులు యేసు రెడ్డి, పిచ్చి రెడ్డి, వెంకటేశ్వర్లు, బంతిరామ్, నరసింహ, బ్రహ్మారెడ్డి, వెంకటరెడ్డి, రమేష్, మాధవ రెడ్డి, శివకృష్ణ, ఉపాధ్యాయులు రాములు, నవీన్ కుమార్, ఆలు, పార్వతి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే, యుగంధర్



**సత్తుపల్లి, మార్చి17 (ప్రజా జ్యోతి) :** వేంసూర్ మండలానికి చెందిన సీనియర్ నాయకులు వెల్ది జగన్మోహన్రావు వారి మనవడు సాయి తేజ వివాహ మహోత్సవం శ్రీ కన్వెన్షన్ కొంపల్లి ఫంక్షన్ హాల్లో ఆదివారం రాత్రి వివాహం జరిగింది. ఈ వివాహ వేడుకకు సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, ఖమ్మం జిల్లా మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

## సీసీరోడ్డుకు శంకుస్థాపన చేసిన మాజీ ఉపసర్పంచ్ గోవిందు భాగ్యమ్మ

**తల్లాడ, మార్చి 17 (ప్రజా జ్యోతి న్యూస్) :** తల్లాడ మండలంలోని



అన్నారుగూడెం గ్రామంలో సీసీ రోడ్డుకు గ్రామ మాజీ ఉప సర్పంచ్ గోవిందు భాగ్యమ్మ, సొసైటీ డైరెక్టర్ గోవిందు శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కృషితో సిసి రోడ్లు మంజూరైనట్లు వెల్లడించారు. గ్రామంలో మట్టి రోడ్లను సిసి రోడ్లుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. నిధులను మంజూరు చేసిన ఎమ్మెల్యే రాగమయి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నం కృష్ణయ్య, గోవిందు శ్రీనివాసరావు ట్రాక్టర్, గోవిందు సురేష్, స్థానికులు పాల్గొన్నారు.

# రూ.151తో ఇంటివద్దకే సీతారాముల ముత్యాల తలంబ్రాలు

**సత్తుపల్లి, మార్చి17, (ప్రజా జ్యోతి) :** ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా ఇంటి వద్దకే భద్రాచలం సీతారాముల కల్యాణ ముత్యాల తలంబ్రాలు కేవలం151 రూపాయలతో అందించబడతాయని సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి సోమవారం తెలిపారు. డిపో మేనేజర్ కార్యాలయంలో సీతారాములకు కళ్యాణం ముత్యాల తలంబ్రాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి,మొదటి బుకింగ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రాచలం సీతారాముల కళ్యాణానికి వెళ్లలేని వారి సౌకర్యార్థం టి జి ఎస్ ఆర్ టి సి లాజిస్టిక్స్ వారి ద్వారా కేవలం 151 రూపాయలతో ఇంటి వద్దకే ముత్యాల తలంబ్రాలను అందించనున్నట్లు ఆమె వివరించారు. రామభక్తులు ప్రతి ఒక్కరూ ఈ సదా అవకాశాన్ని ఉపయోగించుకొని ముత్యాల తలంబ్రాలను ఇంటి వద్ద పొందాలని ఆమె కోరారు. బుకింగ్ చేసిన వారికి రెండు ముత్యాలతో కూడిన తలంబ్రాలు ఇంటి వద్దనే ఇవ్వబడును, ముత్యాల తలంబ్రాలు కావలసినవారు సత్తుపల్లి డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్కే మునీర్ పాషా 9154298585, విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు 9866619189 లను సత్తుపల్లి 9154298594 అశ్వరావుపేట 9494232424, కల్లూరు 8688972823, వి ఎం బంజర 7382858372 అన్నపురెడ్డిపల్లి 9701573644 సంప్రదించాలని కోరారు.




సత్తుపల్లి డిపో పరిధిలోని రామ భక్తులందరూ ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి విజయ శ్రీ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్ సాహితి, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్ కే మునీర్ పాష ,ఆఫీసు సిబ్బంది బాబురావు, టైపిస్టు శ్రీనివాస్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# చెన్నూరులో దివ్యాంగులకు ఉచితంగా బస్‌పాస్‌ల పంపిణీ

**కల్లూరు, మార్చి 17 (ప్రజా జ్యోతి) :** మండల పరిధిలోని చెన్నూరు గ్రామపంచాయతీలో సోమవారం అర్హులైన దివ్యాంగులకు చెన్నూరు గ్రామానికి చెందిన కె.వి.ఆర్ ఆర్థిక సహకారంతో సత్తుపల్లి ఆర్టీసీ డిపో వారి చేత ఉచితంగా బస్పాసలను పంపిణీ చేశారు.ఆర్టీసీ వారు అందించే బస్పాసులతో పల్లె వెలుగు,ఎక్స్ప్రెస్,డీలక్స్ బస్సులలో 50% రాయితీతో ప్రయాణించవచ్చునని అన్నారు. ఒక్కొక్క ఐడి కార్డుకు అయ్యే ఖర్చు ను కె.వి.ఆర్ ఆర్థిక సహకారంతో గ్రామపంచాయతీ పరిధిలోని అర్హులైన దివ్యాంగులందరికీ అందించటం జరుగుతుందని అన్నారు.చెన్నూరు గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నూరు రావికంపాడు నుండి అర్హులైన దివ్యాంగులు ఈ బస్ పాస్ లను అందుకున్నట్లు ఆర్టీసీ వారు తెలిపారు.సుదూర ప్రాంతమైన సత్తుపల్లి కి వచ్చి దివ్యాంగులు బస్సు పాస్ లు తీసుకోవడం వ్యయ ప్రయాసలతో కూడుకున్న విషయం కావడంతో తమ స్వగ్రామంలో క్యాంపు ఏర్పాటు చేసి ఉచితంగా దివ్యాంగులందరికీ బస్ పాస్ లు అందించాలని సంకల్పంతో ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందించిన కెవిఆర్ ను పలువురు దివ్యాంగులు,గ్రామస్తులు అభినందించారు.గత రెండు సంవత్సరాలుగా చెన్నూరు గ్రామంలో అర్హులైన దివ్యాంగులందరికీ తన సొంత



ఖర్చులతో బస్పాసులను అందించడం హర్షనీయమని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారుఈ కార్యక్రమంలో విలేజ్ బస్సు ఆఫీసర్ కిన్నెర. ఆనందరావు,సిబ్బంది కంచి.శాంసన్ పలువురు గ్రామస్తులు దివ్యాంగులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

### అదనపు కలెక్టర్‌లు డాక్టర్ శ్రీజ, శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లు సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లు ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లు మాట్లాడుతూలి ప్రజల అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించరాదని, గ్రీవెన్స్ లో అందించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. కూసుమంచి మండలం పెరిక సింగారం గ్రామానికి చెందిన బి. ఆదెమ్మ గ్రామంలో సర్వే నెంబర్ 231 లో ఎకరం 3 గుంటల భూమి తన భర్త పేరు మీద ఉన్న భూమికి, తన ఆడపడుచు నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా పాసు బుక్కు తీసుకున్నారని, తమ భూమి తమకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేయగా, సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరం దొరన్ననగర్ కు చెందిన జి. నరేష్ తన భార్య కు సెప్టెంబర్ నెలలో ప్రెగ్నెన్సీ కన్ ఫార్మ్ అయిందని, మా మధ్య కొన్ని గొడవలు జరుగడం వల్ల తన అనుమతి లేకుండా 5 నెలల గర్భవతికి వారి కుటుంబ సభ్యులు అబార్షన్ చేయించారని, దీనిపై తగిన చర్యలు తీసుకొని చట్టరీత్యా కేసులు నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎంహెచ్ఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కల్లూరు మండలానికి చెందిన కే. సత్యవేణి బిఎస్సీ బి.ఎడ్ చేసానని తనకు కంప్యూటర్ ఆపరేటింగ్ వచ్చుని, తనకు ఏదైనా ఉద్యోగం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఖమ్మం నగరం టేకులపల్లి కేసిఆర్ టవర్స్ కు చెందిన ఎస్.కే. హసీన బ్లాక్ నెంబర్ 30 ఎఫ్ 2 లో నివాసం ఉంటున్నానని, ఇంటిలో షాట్ సర్క్యూట్ జరిగిందని, ఇల్లు మొత్తం బూడిద అయిందని, తనకు పరిహారం అందించి సాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ, అధికారులు పాల్గొన్నారు.





# మధ్య గేట్ వద్ద ప్లై వోవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

- ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ తర్వాత ప్రజలకు ఒరిగిందేమి లేదు
- నగరంలో ప్రధాన సమస్యలపై 29న నగర పాలక సంస్థ కార్యాలయం ముట్టడి
- విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్




**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ తర్వాత ప్రజలకు ఒరిగిందేమి లేదని, 15 నెలల అధికారంలో పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని, ఖమ్మం నగరంలో పలు ప్రధానమైన సమస్యలు పెండింగ్లో ఉన్నాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ పేర్కొన్నారు. సోమవారం ఖమ్మంలోని సుందరయ్య భవన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గాంధీచౌక్, కమాన్బజార్ వీధులకు అనుసంధానంగా ఉన్న రైల్వే మొండిగేటును పూర్తిగా మూసివేశారని, ప్రభుత్వానికి మొండి గేటుపై ముందస్తు ఆలోచన లేదని ఆరోపించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులుండి జిల్లా కేంద్రానికి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని తక్షణం మిని ప్లైవోర్ను నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా పేదలకు రేషన్కార్డులు ఇవ్వలేదని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ స్మార్టు రేషన్కార్డులు ప్రకటించి అమలు చేయలేదని ఆరోపించారు. ఖమ్మంలో అంతర్గత రహదారులు నిర్మాణం, ఇళ్ల స్థలాలు, ఆసరా పింఛన్లు పెంపు వంటి అనేక సమస్యలపై ఈనెల 29న ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ ఖమ్మంలో రాష్ట్ర మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వటం విడ్డూరంగా ఉందన్నారు. డిపో రోడ్డు, ఎన్ ఎస్ టి రోడ్డు, పీఎస్ఆర్ రోడ్డు తో పాటు నగరంలోని ఇరుకుగా ఉన్న పలు రోడ్లను వెడల్పు చేసి ట్రాఫిక్కు ఇబ్బందులేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరానికి బీజేపీ నాయకులు కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా దొంగల తిరుపతిరావు, ఎంఎ జబ్బార్, ఎస్కే మీరా సాహెబ్, ఖమ్మం డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు వజేనేపల్లి శ్రీనివాసరావు , భూక్యా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోని బడుగు బలహీన వర్గాలకు నేడు చారిత్రాత్మక దినం



**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లును చట్టసభల్లో ఆమోదంతో బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం కాంగ్రెస్తోనే సాధ్యమని నిరూపితమైంది. చారిత్రాత్మక బీసీ బిల్లును ప్రవేశపెడుతున్న కాంగ్రెస్తో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కలిసిరాకపోతే బీసీ సామాజికవర్గం ఆ పార్టీలను ఎన్నటికీ క్షమించదు. బీజేపీ వారికి నిజంగా బీసీలకు న్యాయం చేయాలని ఉంటే దీన్ని కేంద్రంలో కూడా ఆమోదించేలా బీజేపీ అధిష్టానాన్ని ఒప్పించాలి. విద్య, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లును చట్టసభల్లో ఆమోదంతో కాంగ్రెస్ పార్టీయే బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తుందని మరోసారి రుజువయ్యింది. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని చెప్పడానికి బీసీ రిజర్వేషన్ల, ఎస్సీ వర్గీకరణ బిల్లులను చట్టసభల్లో ప్రవేశపెట్టడమే నిదర్శనం ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం రాష్ట్రంలో కులగణన పూర్తి చేసి కాంగ్రెస్ చరిత్ర సృష్టించడమే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాని డిమాండ్ చేస్తున్నా,కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్నిడిమాండ్ చేస్తున్నా. బీజేపీ నేతలకు చిత్త శుద్ధి ఉంటే 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలపండి రాష్ట్రంలో కులగణన పూర్తి చేసిన కాంగ్రెస్ బీసీలకు న్యాయం చేసే దిశగా వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లును చట్టసభల్లో ఆమోదం తర్వాత కేంద్రానికి పంపిస్తుంది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు 23 శాతానికి తగ్గించి చారిత్రాత్మక తప్పు చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు పశ్చాతాపం వ్యక్తం చేస్తూ, బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తానని చెప్పిన కేసీఆర్, గెలిచాక తానే గద్దెనెక్కి దళితులను అవమానించారు అని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్

## వడ్డే రామారావు మనవరాలు లిఖిత సాయిశ్రీకి ఉత్తమ అవార్డు




**తల్లాడ, మార్చి 17 (ప్రజా జ్యోతి న్యూస్) :** భరతనాట్యంలో అద్భుత ప్రదర్శన కనబరిచిన తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డే రామారావు, లీలావతి మనవరాలు చిన్నారి లిఖిత సాయిశ్రీ ఉత్తమ అవార్డు అందుకున్నారు. హైదరాబాదులోని రవీంద్ర భారతి లో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీ విశ్వావాసు నామ సంవత్సరం సందర్భంగా ఉగాది బాల పురస్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చిన్నారి లిఖిత సాయి శ్రీ భరతనాట్యంలో అత్యంత ప్రతిభ కనబరిచి అవార్డును సొంతం చేసుకుంది. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త దైవాజ్ఞ శర్మ చేతుల మీదుగా ఉగాది బాల పురస్కార్ అవార్డు అందుకున్నారు. చిన్నారిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో భరతనాట్య గురువు కనతాల ఫణి, నిహారిక తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్మికి న్యాయం చేయాలని మహిళల నిరసన



**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** బాధితురాలు లక్ష్మికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా పరిషత్ సెంటర్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు నిరసన ప్రకటించారు. జిల్లా పరిషత్ సెంటర్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించి , ఫ్ల కార్డులు చేబుని , లక్ష్మి కు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి , కార్యదర్శి స్పందన , గౌరవ సలహాదారులు అమృత భవాని మాట్లాడుతూ రఘునాధపాలెం మండలం పువ్వాడ ఉదయ నగర్ కు చెందిన లక్ష్మి తన భర్త ప్రసాద్ తో కిరాణా షాపు నడుపుకుంటూ జీవిస్తుండగా , పువ్వాడ ఉదయ నగర్ కు చెందిన సంగ పంగా నరసింహారావు అనే వ్యక్తి మాయమాటలతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి లక్ష్మిను శారీరికంగా లొంగ తీసుకున్నా డని ఆరోపించారు. తన భర్త ప్రసాద్ తనను ఇంటి నుండి ఇంటి బహిష్కరించారని తెలిపారు. దీంతో లక్ష్మి నరసింహారావును కలసి , తనను భార్యగా స్వీకరించి , ఏలుకోవాలని కోరగా నరసింహారావు .....పువ్వాడ ఉదయ నగర్ మాజీ సర్పంచ్ లలిత , కాంపాటి రవిలి లు లక్ష్మి ను బెదిరించారని విమర్శించారు. బాధితురాలు లక్ష్మి మాట్లాడుతూ మోసపూరిత మాటలతో నన్ను నమ్మించి , శారీరికంగా లోబర్చుకోని , బర్త ,పిల్లలకు దూరం చేసి , నా నుండి బంగారు ఆభరణాలు తీసుకోవటమే కాకుండా నా బంధువుల నుండి లక్ష రూపాయలు అప్పుగా తీసుకుని , నా దగ్గర గల లక్ష రూపాయలను కూడా చే బదులు గా తీసుకోవడమే కాకుండా నన్ను దూరం పెడుతున్నాడని ఆరోపించారు. నా పేరు పై ఉన్న భూమిని నా పేరు మీదే రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పి , ఈ విషయంలో కూడా డబ్బులు తీసుకొని మోసానికి పాల్పడ్డాడని తెలిపారు. శ్రీశైలం కు తీసుకెళ్లి , సగపంగా నరసింహారావు నన్ను వివాహం చేసుకున్నాడని , కొంతకాలం ఖమ్మంలో నాతో కాపురం చేశాడని పేర్కొన్నారు. ప్రస్తుతం నా భర్త నన్ను బహిష్కరించడంతో ఇల్లు వాకిలి లేక నేను ఒంటరిగా ఉంటున్నానని నన్ను వివాహం ఆడి, కొంతకాలం నాతో ఇప్పుకాపురం చేసిన నరసింహారావు ఇప్పుడు దూరం పెట్టడం చేస్తున్నాడని , ఈ విషయంలో నాకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నరసింహారావు సోదరి లలిత పువ్వాడ ఉదయ నగర్ మాజీ సర్పంచ్ కాగా ఆమె భర్త కాంపాటి రవి టిఆర్ఎస్ నాయకుడు కావడంతో నన్ను తీవ్రమైన బెదిరింపులకు పాల్పడు తూ ఎక్కడెక్కడ కనబడితే అక్కడ నేను హెచ్చరికలు జారీ చేస్తున్నారని ఆంగ్ల వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షురాలు ప్రమీల, కే .లక్ష్మి , ప్రధాన కార్యదర్శి విజయ ,సహాయ కార్యదర్శి బి .జ్యోతి ,అధికార ప్రతినిధి త్రివేణి , నాయకులు కృష్ణవేణి, కవిత, విజయ ,నాగేంద్ర , లలిత భాయి , సుశీల ,ఝాన్సీ ,సుభద్ర ,దేవి పాల్గొన్నారు.

# తల్లాడలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేసిన దగ్గుల నాగిరెడ్డి

**తల్లాడ, మార్చి 17 (ప్రజా జ్యోతి న్యూస్) :** తల్లాడలో సీసీ రోడ్డుకు తల్లాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నీలాద్రి ఆలయ డైరెక్టర్ దగ్గుల నాగిరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. బస్టాండ్ వెనుక ప్రాంతంలో సిసి రోడ్డు నూతనంగా నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆయన కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిసి రోడ్లు లేక స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, దాని దృష్టిలో పెట్టుకొని రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు యాచ వరకు విజయ రెడ్డి, గుండ్ల కృష్ణ, పంతంగి శ్రీనివాస్, కందికొండ నర్సిరెడ్డి, కోటేరు సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలు



**కల్లూరు, మార్చి 17 (ప్రజా జ్యోతి) :** పద్మ శ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు కల్లూరు ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో 5వ రోజు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు.సోమవారం వారు మాట్లాడుతూ సీఎం అసెంబ్లీ సాక్షిగా సుప్రీం కోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ దేశంలో మొట్ట మొదట ఎస్సీ వర్గీకరణను చేపట్టి సుప్రీం కోర్టు తీర్పును అమలు పరచిన రాష్ట్రంగా తెలంగాణే ఉంటుందని ఇచ్చిన హామీని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు.సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయకుండా ప్రభుత్వ నియామకాలు చేపట్టడం అన్యాయం అన్నారు.ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్సీ లను ఏబిసిడి లుగా వర్గీకరణ చేసి నియామకాలు చేపట్టి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వెంగల వెంకటేశ్వర్లు,గుండ్ర తిరుమల రావు, కొత్తపల్లి వెంకటి,కొరకొప్పు ప్రసాద్,తేల్లూరి భాస్కరరావు ఖమ్మంపాటి బాబురావు,ప్రకాష్,దేవదాసు వెంకటి,వెంకటేశ్వర్లు,నాగరాజు, ఆర్టీసీ నాగేశ్వరరావు,ప్రసాద్ రావూరి సీతారాములు,చెరుకుమల్లి శేఖర్ కనకపుడి జయరాజు చిన్న మైసయ్య వేల్పుల వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతికి ధన్ ఖడ్ కు ఎంపీ రవిచంద్ర పరామర్శ



**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** ఇటీవలే అనారోగ్యానికి గురై విశ్రాంతి తర్వాత కోలుకుని పార్లమెంట్ కు హాజరైన ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ ను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉప నేత, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సహచర ఎంపీలతో కలిసి సోమవారం పరామర్శించారు. పార్లమెంట్ ఆవరణలోని రాజ్యసభ చైర్మన్ ఛాంబర్లో ఈ మేరకు ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. ప్రజలు, దేవుని ఆశీస్సులతో సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవడం పట్ల ఎంపీ రవిచంద్ర ఆనందం వ్యక్తం చేశారు. మరింత కాలం ప్రజా సేవకు అంకితం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతిని కలిసి పరామర్శించిన వారిలో తెలంగాణకు చెందిన భాజపా ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ కూడా ఉన్నారు.

## డంపింగ్ యార్డ్‌ను సందర్శించిన మేయర్ పూనుకోలు నీరజ



**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** సోమవారం ఖమ్మం నగర మేయర్ పునకొల్లు నిరజా డంపింగ్ యార్డు ను సందర్శించారు. గతంలో డంపింగ్ యార్డులో పేరుకుపోయిన 80 వేల టన్నుల లెగసీ వేస్ట్‌ను బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా తొలగించి, అక్కడి 7 ఎకరాల భూమిని చదును చేసి మియావాకి ఫారెస్ట్ ప్లాంటేషన్‌కి అనువుగా మార్చారు. ఈ ప్రాజెక్ట్‌లో మొత్తం 10,000 నుంచి 12,000 మొక్కలను నాటే లక్ష్యంగా పని జరుగుతోంది. ఇప్పటివరకు 7,000 మొక్కలు నాటివేసి, వాటికి పాదులు ఏర్పరిచి, కర్రలు కట్టి సంరక్షణ చర్యలు తీసుకున్నారు. ప్రతిరోజూ నీరు పోసి క్రమంగా చూసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఈ మొక్కలు ఇప్పుడు పెరిగి, పూలు కాయలు వచ్చినందుకు మేయర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రదేశం పచ్చదనంతో కళకళలాడేందుకు చేపడుతున్న ఈ ప్రయత్నం, నగరంలోని పర్యావరణ అభివృద్ధికి గొప్ప దశగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో హార్టికల్చర్ ఆఫీసర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# భుజం మీద భూమి పుస్తక ఆవిష్కరణ

## విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ



**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** ప్రముఖకవి,వాగ్గేయకారుడు,కన్నెగంటి వెంకటయ్య చే కవితా సంపుటి "భుజం మీద భూమి" పుస్తకాన్ని ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ చే, న్యూవిజన్ కాలేజ్ లో ఆవిష్కరించుకోవడం జరిగింది.. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులు జాషువా సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షులు మువ్వ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ప్రముఖ సాహిత్యం విమర్శకులు గా గుంటూరు లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ . కన్నెగంటి "భుజం మీద భూమి" పుస్తకం లోని అంశాలు, హృదయంలో దాగి ఉన్న భావాన్ని సాహిత్యాన్ని చాలా చక్కగా అర్ధవంతంగా సభికులకు అర్థమయ్యే విధంగా ,కవిలో దాగి ఉన్న దళిత సాహిత్యాన్ని, వామపక్ష భావజాలాన్ని సాహిత్య స్వరూపాన్ని కళ్లకు కట్టే విధంగా ఆద్యాంతం సభికులకు ఆనందింపజేసే విధంగా పాటల ద్వారా మాటల ద్వారా రంజింపజేశారు.అదేవిధంగా కవి ఐనాల సైదులు "భుజం మీద భూమి" పుస్తకాన్ని సూక్ష్మంగా కవిలో దాగి ఉన్న సాహిత్యాన్ని నేటితరం యువతీ యువకులకు సాహిత్య ప్రేమికులకు అర్థం పట్టే విధంగా చాలా చక్కగా వివరించడం జరిగింది. ఈ పుస్తకాన్ని కన్నెగంటి వెంకటయ్య జన్మస్థలం అయినా లాలాపురం ప్రముఖ సిపిఎం జిల్లా నాయకులు సంక్రాతి మధుసూదన్ రావు కి అంకితం ఇవ్వడం జరిగింది. ఈ పుస్తకాన్ని వారి కుమారుడు సంక్రాంతి రవికుమార్ కి అందజేయడం జరిగింది. సభాధ్యక్షులు మువ్వ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటివరకు గాయకుడిగా గేయ రచయితగా కవిగా ఉన్న కన్నెగంటి నేటి నుండి బుక్కు రూపంలో బుక్ అయిపోయాడు అని చమత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లాలాపురం గ్రామం నుండి తన చిన్ననాటి స్నేహితులు హాజరవడం జరిగింది. అదేవిధంగా గాయకుడు కవి వాగ్గేయకారుడు గజల్స్ రచయిత అయిన కన్నెగంటి వెంకటయ్య మాట్లాడుతూ నేను చదువుకునే రోజులలో ప్రధానంగా బువ్వ కొరకు నేను స్కూల్ కి వెళ్లడం జరిగింది. ఇక్కడ నుండి నా ప్రయాణం ఉస్మానియా యూనివర్సిటీ వరకు వెళ్లి నేడు అప్పల నరసింహా పురం జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ గెజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్ననంటే దానికి కారణం నా తల్లిదండ్రులు. నా చదువు విషయంలో ఎన్నో త్యాగాలు చేయడం జరిగింది. అందులో నా తమ్ముడు శ్రీను సగభాగమై అటు కుటుంబానికి ఇటు నాకు కొండంత అండై నా ఎదుగుదలకు తోడ్పాటు అందించడం జరిగింది .అదేవిధంగా నా అర్ధాంగి అరుణ కుమారి అటు కుటుంబాన్ని పిల్లల్ని నన్ను నా సాహిత్యంలో సగభాగమైంది. నేను చదువుకునే సమయంలో మా ఊరిలో అదేవిధంగా సమాజంలో ఉన్న కుల వివక్ష నన్ను కృంగదీసింది. అయినప్పటికీ చదివే అన్నిటికీ పరిష్కారం మార్గంగా భావించి నా స్నేహితులు (లాలాపురం)సహకారంతోనే నేను ముందడుగు వేస్తూ ...ఆ మార్గంలో ఆ రోజుల్లో సమాజాన్ని పట్టిపీడిస్తున్న సారా వలన అనేకమంది జీవితాలు నా కళ్ళముందే కనుమరిగాయి .ఆ సందర్భంలో నేను రాసిన "ఆక్కో సారాయి చుక్క" పాటతో నేను ఈ ప్రపంచానికి పరిచయం అవ్వడం జరిగింది. అక్కడ నుండి నా ప్రయాణం సినారె రాసిన గజల్స్ ద్వారా నేను పనిచేసిన అశ్వరావుపేట, ముదిగొండ చెరువు మాదారం జిల్లా పరిషత్ హై స్కూల్ లలో సాహిత్య%శీ% మీద ప్రేమతో పిల్లలచే అనేక రచనలు వ్రాయించడం జరిగింది. వారు జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో అనేక బహుమతులు పొందడం జరిగింది. సాహిత్యంలో నాకంటే ఎక్కువగా తయారు చేయడంలో నేను కృత నిశ్చయైనాను. నన్ను సన్మార్గంలో నడిపించిన సంక్రాంతి మధుసూదన్ రావు కి అంకితం ఇవ్వడం నాకు చాలా గర్వంగా ఉంది. అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి తెలంగాణ గవర్నమెంట్ హెడ్మాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వీరస్వామి లాలాపురం సిపిఎం పార్టీ నాయకులు చింత నిప్పు చలపతిరావు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ ఖమ్మం జిల్లా తెలుగు సాహిత్యతెలుగు రచయితలు కొమ్మవరపు, గద్దపాటి శ్రీనివాసరావు ,శేషగిరి పోత గాని ,దేవయ్య,సునంద,అరుణకుమారి,కొండ్రుబ్రహ్మం, సంక్రాంతి చంద్రశేఖర్ ,రవికుమార్ ఉత్తంకుమార్ ,రమేష్ ,మాజీ సర్పంచి సంక్రాంతి చంద్రశేఖర్ చింత నిప్పు కృష్ణారావు , రామారావు, జానీ, పాషా దామోదర్ గట్టి గుండె వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.





## మధ్య గేటుకు బదులుగా ఆర్.వో.బి. లేదా ఆర్‌యుబీ నిర్మించాలి : ఆర్.జె.సి. కృష్ణ



**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** ఖమ్మం గాంధీచౌక్ లోని బడ్జట్ హెూటల్ లో ఆర్.జె.సి. కృష్ణ ఆధ్వర్యంలో 3 టౌన్ పరిరక్షణ కమిటీ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ మరియు వివిధ రాజకీయ పార్టీల బాధ్యులతో అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఖమ్మం మధ్యగేటు 104 గత 2 నెలలుగా మూసివేస్తూ రాబోయే 6 నెలలు కూడా మూసివేయాలని రైల్వేబోర్డు నిర్ణయం తీసుకోవడం జరిగింది. దీని వలన 1 టౌన్ మరియు 2 టౌన్ (కమాన్ బజార్), 3 టౌన్ (గాంధీచౌక్) మధ్య సంబంధాలు తెగిపోయాయి. దీని వలన 3 టౌన్ ప్రాంతంలో బంగారు మరియు ఇతర షాపులు ఆర్థికంగా దెబ్బతినటం జరిగింది. కావున అందరు కలసి మధ్యగేటు ప్రాంతాన్ని ఆర్.ఒ.బి. లేదా ఆర్.యు.బి. చేయవలసినదిగా ఒత్తిడి చేయుటకు తీర్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఖమ్మం మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, ఎం.పి. రామసహాయం రఘురామరెడ్డి, ఎం.పి. వద్దిరాజు రవిచంద్ర, ఎం.పి. రేణుకాచౌదరి, ఇతరులను కలవాలని నిర్ణయం చేడటం జరిగింది. మంళవారం ఉదయం 10 గంటలకు బడ్జట్ హెూటల్ నుండి పాధయాత్రగా మధ్య గేటు కు చేరుకొని దానిపై రైల్వే స్టేషన్ మేనేజర్ను కలసి వినతి పత్రం అందచేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బి.జే.పి. నుండి సన్నె ప్రాతాప్, టి.డి.పి. నుండి పెనుగొండ ఉపేంధర్, సి.పి.ఐ. నుండి నూనె శశిధర్, సి.పి.యమ్. నుండి యర్రా శ్రీకాంత్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, కిరాణా జాగ్రీ మర్చంట్ అధ్యక్షులు వెంకన్న, బంగారు షాపుల నుండి బంధు సూర్యం, మేళ్ళచెరువు వెంకటేశ్వర్లు, కాళ్ళ పాపారావులు పాల్గొన్నారు.

## ఖమ్మం నగరంలో అనధికారిక హెూర్డింగ్స్, ఫ్లెక్సీల తొలగింపు



**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని వైరా రోడ్‌లో డివైడర్లపై ఏర్పాటు చేసిన హెూర్డింగ్స్, బోర్డులు, ఫ్లెక్సీలు పాదాచారులకు ఇబ్బంది కలిగించడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం మరియు డి ఆర్ ఎఫ్ సిబ్బందితో కలిసి ఇవన్ని తొలగించడం జరిగింది. పౌరుల సౌకర్యం మరియు నగరంలోని ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ఈ చర్యలు చేపట్టామని, ఇకపై కూడా నగరంలోని అనధికారిక ఫ్లెక్సీలు, హెూర్డింగ్స్ తొలగించే ప్రక్రియ కఠినంగా కొనసాగుతుందని మున్సిపల్ అధికారులు వెల్లడించారు.



# మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ప్రభుత్వాలు నియంత్రించడం లేదు

## వీరనారి సావిత్రిబాయి పూలే మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పి ఆర్ దేవి




**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** ఖమ్మం నగరంలో సావిత్రిబాయి పూలే మహిళా సంఘం జిల్లా సమావేశంలో కటకం లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీరనారి సావిత్రిబాయి పూలే మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పి ఆర్ దేవి పాల్గొని మాట్లాడారు . రాను రాను సమాజం ఏమైపోతుందో ఇంకా వ్యక్తులలో మార్పు రావడం లేదు మహిళలు ఒంటరిగా బయటికి రావాలంటే భయపడుతున్నారు . ఇప్పటికీ కూడా మహిళలకు స్వేచ్ఛ అనేది లేకపోవడం చాలా బాధాకరం . పసిపిల్లల దగ్గర నుండి 70 ఏళ్ల ముసలి వాళ్ళ పై కూడా అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి . చట్టాలు ఎన్ని వచ్చినా నియంత్రించలేకపోతున్నారు ఇప్పుడున్న సమాజంలో మహిళలు తమ కుటుంబాలను చూసుకుంటూ బయటికి వచ్చి ఉద్యోగాలు చేస్తూ జీవన ఉపాధి కోసం కష్టపడుతున్నారు . అయినప్పటికీ ఇంకా చాలా అత్యాచారాలు ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి . ప్రభుత్వం వారు వీటిపై ఇంకా చర్యలు కఠినంగా తీసుకోవాలి , మహిళలకు రక్షణ కల్పించాలి అని అన్నారు . అలాగే ఇప్పుడున్న పరిస్థితుల్లో నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి . భార్యాభర్తలు ఎంత కష్టపడుతున్న అవి ఎటు సరిపోని పరిస్థితుల్లో ఉన్నారు . ప్రజలు కనుక ప్రభుత్వం నిత్యవసరసరుకులపై రేట్లు తగ్గించాలని కోరారు . అలాగే వృద్ధులు , వికలాంగులు , వితంతువులు , ఒంటరి మహిళల పెన్షన్లు కూడా పెంచుతామన్నారు కానీ అవి ఇప్పటివరకు ప్రభుత్వం వాటిని అమలు చేయలేదు . కాబట్టి పింఛన్ల మీదనే బతుకుతు ఎంతోమంది వాటి కోసమే ఎదురుచూస్తున్నారు . కాబట్టి ప్రభుత్వం తక్షణమే తను పెంచుతానన్నవి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు . అలాగే కొత్త అప్లికేషన్లు కూడా తక్షణమే రేషన్ కార్డులు కానీ కొత్త పెన్షన్లు కానీ అమలు చేయవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ సమావేశంలో వీరనారి సావిత్రిబాయి పూలే మహిళా సంఘం నాయకులు చిప్ప సత్యవతి , భూక్యా మణి , ఇనుప నూరి నాగలక్ష్మి , తిప్పర్తి రమ్య , కామన అనంతలక్ష్మి , భవాని , ఖమ్మం జిల్లా ఉమెన్ రైట్స్ అధ్యక్షులు మంచు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు .

# పోగొట్టుకున్న 48 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగింత




**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** పోగొట్టుకున్న 48 మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి బాధితులకు అప్పగించినట్లు అడిషనల్ డీసీపీ ఆడ్మిన్ నరేష్ కుమార్ తెలిపారు. బాధితులు పోగొట్టుకున్న/చోరీకి గురైన మొబైల్ ఫోన్ ను సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో మొబైల్ ఫోన్ ట్రాక్ చేసిన ఐటి సెల్ బృందం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచనలతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో యజమానులకు అడిషనల్ డీసీపీ చేతుల మీదుగా అప్పగించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ...సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ విధానంతో సుమారు 7 లక్షల విలువ గల 48 ఫోన్లను ట్రేస్ చేసి, నిజమైన యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. ఒక్కొక్క మొబైల్ ఫోన్ లక్ష యాభై వేల నుండి 10 వేల రూపాయలు ఖరీదు గల ఫోన్లను ట్రాక్ చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 680 మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు సి ఈ ఐ ఆర్ పోర్టల్ ఫిర్యాదులు నమోదు కాగా 582 ఫోన్ల ట్రాక్ ను గుర్తించి 290 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుత జీవన శైలిలో మొబైల్ ఫోన్ అత్యంత కీలక పరికరం అయ్యిందని, ఏదైనా సమాచారం తెలుసుకోవాలన్న....నగదు లావాదేవీలు చేయాలన్న మొబైల్ ఫోన్ పైనే ఆదారపడేంతగా ప్రాదాన్యం సంతరించుకుందని అన్నారు. మొబైల్ ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్న చోరికి గురైతే పరిస్తితి ఎలా ఉంటుందో ఊహించనవసరం కష్టమేనని అన్నారు. పోయిన ఫోన్ లను వెతికి పెట్టడానికి పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందన్నారు. సెల్ ఫోన్ల రికవరీ లో కీలకంగా వ్యవహరించిన ఐటి సెల్ నోడల్ ఆఫీసర్ ఏసీపీ వెంకటేశ్, ఎస్సై సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ హెమనాథ్, కానిస్టేబుల్ నరేష్, కానిస్టేబుల్ శ్రీను ను పోలీస్ కమిషనర్ అభినందించారు.

# ఖమ్మం నగర కార్పెంటర్స్ యూనియన్ల జేఏసీ నిరసన



**ఖమ్మం ప్రతినిధి, (ప్రజాజ్యోతి) :** తాటికొండ పుల్లయ్య నందిగామ బ్రహ్మం దోనోజు లక్ష్మయ్య, అధ్యక్షతన జెండా ఊపి నరసన్న ప్రారంభించారు.వర్తక సంఘము సెంటర్,పాత బస్టాండ్,అంబేద్కర్ సెంటర్, చర్చి కాంపౌండ్ వరకు సాగింది. ఖమ్మం నగరంలో కార్పెంటర్ వృత్తిలో కొనసాగుతున్నటువంటి మేస్త్రీలు, గత కొంతకాలంగా ఎలాంటి ఎదుగూ-బొదుగూ లేకుండా ఉన్నారు. దీనికి కారణం - వర్కర్ల రేట్లు విపరీతంగా పెరిగినవి. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. మన వృత్తికి సంబంధించిన మిషనరీ పరికరాల రేట్లు మనకు అందుబాటులో లేకుండా పెరిగాయి. మనం చేస్తున్నటువంటి పనికి సంబంధించిన మెటీరియల్ రేట్లు కూడా చుక్కల్లో ఉన్నాయి. కానీ మనం యజమానుల దగ్గర మాత్రం ఎన్నో ఏండ్ల క్రితం ఉన్నటువంటి రేట్లతోనే కొనసాగుతున్నాం. కరోనా వచ్చిన దగ్గరినుండి చూస్తే ఇవాళ ప్రతీదానికీ రేట్లు పెరిగాయి. కానీ మన వృత్తికి సంబంధించిన గత కొన్ని సంవత్సరాలుగా రేట్లు పెరగలేదు. పెరగకపోగా ఉన్న రేట్లనే ఇంకా తగ్గించి ఇస్తున్నారు. మెటీరియల్ కి ఎంత రేటైనా పెట్టి కొంటున్నారు. కానీ మన దగ్గరికి వచ్చేసరికి మనకు సరైన రేటు ఇవ్వడం లేదు. ఇక్కడ మన శ్రమ ఎంత దోపిడీ జరుగుతుందో మనం గ్రహించాలి. ఈ విషయాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఖమ్మం నగరంలో ఉన్నటువంటి కార్పెంటర్స్ సంఘాలన్నీ కూడా ఒక తాటిపైకి వచ్చి జె.ఎ.సి.గా ఏర్పడి మన వృత్తికి సంబంధించిన రేట్లని పెంచాలని కలిసికట్టుగా నిర్ణయించడం జరిగింది. దాని పర్యవసానమే ఈ “బందు” కార్యక్రమం. దీనికి ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వలస కార్మిక సోదరులు సైతం మద్దతిస్తున్నారు. ఇది చాలా మంచి పరిణామం. కావున మన అన్ని సంఘాల కలయికతో ఏర్పడినటువంటి ఈ జె.ఎ.సి. పిలుపునందుకుని ఖమ్మం నగరంలోని ప్రతీ కార్పెంటర్ సోదరుడు ఈ బందులో పాల్గొని జయప్రదం చేసి మన హక్కులను కాపాడుకుందాం. మన యొక్క వృత్తి రేట్లను పెంచుకుందాం. మన జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకుందాం. మన కుటుంబాల ఉన్నతికీ, మన పిల్లల భవిష్యత్తు అభివృద్ధికి బాటలు వేసుకుందాం. మా యొక్క కార్పెంటర్స్ ఇబ్బందులు, బాధలు అర్థం చేసుకుని యజమానులు, బిల్డర్స్ మా ఈ బందుకు సహకరించగలరని మనవి. ఈ బందుకి సంబంధించి మనం ప్రభుత్వం నుండి కూడా అన్ని రకాలుగా చట్టపరమైన అనుమతులు తీసుకోవడం జరిగింది. ఈ బందు యొక్క నియమ నిబంధనలను ఎవరైనా ఉల్లంగించి పని చేసిన యెడల అందుకు గాను రూ? 10,000/-లు వరకు జరిమానా తోపాటుగా తగు చర్యలు తీసుకొనబడును.

### ఖమ్మం మధ్యగేటు వద్ద అండర్ పాస్‌కు రైల్వే మంత్రి హామీ

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించాలని రైల్వే ఉన్నతాధికారులకు సూచించారు. ఖమ్మం మధ్య గేటు సమస్య పై సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు ఎంపీ రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు రైల్వే శాఖ పై రాజ్యసభలో జరిగిన చర్చలో ఎంపీ రవిచంద్ర మధ్య గేటు సమస్యను ప్రముఖంగా ప్రస్తావించారు. కమాన్ బజార్, గాంధీ చౌక్ ప్రాంతాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలకు ప్రధాన మార్గమైన ఈ గేటు గడిచిన నాలుగు నెలలుగా మూసి ఉంచడం వల్ల వ్యాపార లావాదేవీలు స్థంబించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడో ప్లాట్ ఫాం విస్తరణ పనులు వేగం పెంచి. తక్షణమే మధ్య గేటు ను వినియోగంలోకి తేవాలని కోరారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అక్కడ ఆర్వోబీ లేదా అండర్ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించాలని ఎంపీ రవిచంద్ర పార్లమెంట్ లో రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## రాజీవ్ యువ వికాసం పథకం క్రింద గిరిజన నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకోవాలి

### గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** ఏప్రిల్ 5 లోపు రాజీవ్ యువ వికాసం పథకం క్రింద గిరిజన నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకోవాలని ఖమ్మం గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎన్. విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్ తెగలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రకటించిందని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం క్రింద గిరిజన నిరుద్యోగులను స్వయం ఉపాధి పథకాలు అందించడానికి ప్రణాళిక ఆమోదించిందని అన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆసక్తి అర్హత గల నిరుద్యోగ గిరిజన యువత https://tgobmmsnew.cgg.gov.in వెబ్సైట్ నందు ఏప్రిల్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు కలెక్టరేట్ లోని ఉప సంచాలకులు, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం నందు సంప్రదించాలని ఉప సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## గ్రీవెన్స్ లో వినతి అందించిన బీజేపీ నాయకులు



**తల్లాడ, మార్చి 17 (ప్రజా జ్యోతి న్యూస్):** తల్లాడలు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో తల్లాడ బిజెపి మండల అధ్యక్షుడు చల్లా నాగు లు ఆధ్వర్యంలో మండల నాయకులతో కలిసి తాసిల్దార్ సురేష్ కు వినతి పత్రం అందించారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న పరిశుభ్రత, దోమల నివారణ, వీధిలైట్లు, సైడ్ డ్రైనేజ్ నిర్మాణం కొన్ని సమస్యలపై స్థానిక ఎమ్మార్వో కు వినతి పత్రం అందించారు. వినతి పత్రంలో విన్నవించిన సమస్యలను పరిష్కరించి ప్రజలకు స్వచ్ఛ పాలన అందించాలని కోరారు. తల్లాడ మండల కేంద్రంలోని ఇటీవల నిర్మించిన మరుగుదొడ్లు అందుబాటులో లేవని ప్రభుత్వ చేరడానికి వచ్చే మహిళలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని మహిళా సమస్యల దృష్టిలో పెట్టుకొని సమస్యను పరిష్కరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగీతం సాయిచంద్, చౌడా నాగేశ్వరరావు, వాడవల్లి నాగేశ్వరరావు, బెల్లంకొండ రవితేజ పాల్గొన్నారు.

## మహిళ మెడలో నాన్తాడు గుంజుకున్న దుండగులు

**కల్లూరు, మార్చి 17 (ప్రజా జ్యోతి) :** మండల పరిధిలోని కొర్లగూడెం గ్రామంలో మహిళ మెడలోని బంగారు నానుత్రాడు అపహరించినట్లు ఎస్సై డి హరిత పేర్కొన్నారు.ఆమె తెలిపిన వివరాల ప్రకారం కొర్లగూడెం గ్రామానికి చెందిన బైరెడ్డి పద్మావతి అను మహిళ సోమవారం మధ్యాహ్నం ఇంటిముందు పనిచేస్తున్న సమయంలో తన మెడలోని 25 గ్రాముల నాన్ తాడును గుర్తుతెలియని వ్యక్తులు మెడలో నుంచి గుంజుకొని పారిపోయారని,బంగారం విలువ సుమారు రూ. 65వేలు ఉంటుందని,బాధితురాలు ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఇమ్మిడిశెట్టి మురళి కుటుంబానికి అండగా ఆర్యవైశ్యులు

### రూ.90 వేల చెక్కు అందించిన ఆర్యవైశ్య జిల్లా,మండల అధ్యక్షులు



**కల్లూరు, మార్చి 17 (ప్రజా జ్యోతి) :** ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో మరణించిన ఇమ్మడిశెట్టి మురళి కుటుంబానికి అండగా మేమున్నామంటూ ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ అధ్యక్షులు అనుమోలు శ్రీనివాసరావు,పట్టణ కమిటీ అధ్యక్షులు చలువాది నగేష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్రావు చేతుల మీదుగా రూ. 90 వేల రూపాయల చెక్కును సోమవారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సహకరించిన ఆర్యవైశ్యులందరికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి చారుగుండ్ల అచ్యుత సీతారామారావు,సముద్రాల పుల్లారావు,దారా రామారావు, చుండూరి నాగేంద్రబాబు రాచమళ్ళ నాగేశ్వరరావు మిట్టపల్లి వెంకటేశ్వరరావు పసుమర్తి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మహిళల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా బలంగా ఉంటేనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందని ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తుందన్నారు. అన్ని రంగాల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గత 10 సంవత్సరాలుగా ప్రజలను పట్టించుకోని వారు నేడు పనిచేసుకుంటూ ప్రజల నీరాజనాలు పొందుతున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు కొందరు పసలేని విమర్శలు చేస్తున్నారన్నారు. మహిళల కోసం ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి మరొక కొత్త ఆర్థిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సింగరేణి మండలం ఏపిఎం పిడమర్తి వెంకటేశ్వర్లు పనిచేస్తున్నారని, సింగరేణి మండల మహిళా మణుల కోసం ఇంకా ఎంత నిధుల కేటాయిస్తావని ఎమ్మెల్యే అడగగా, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి ఒక్క పథకాన్ని సింగరేణి మండలం లో మహిళలకు అందజేసే వరకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఏపీఎం పేర్కొన్నారు. రాబోయే బడ్జెట్లో ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతుందని పేర్కొన్నారు. కాగా అంతకుముందు లబ్ధిదారురాలు కంచి నాగలక్ష్మి భర్త కంచి రమేష్ ఇటీవల మృతి చెందడంతో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమేష్ తో ఉన్న సాన్నిహిత్యాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, సీసీలు చైతన్య, పగడాల పుష్ప, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు సుహాసిని, గ్రామ సమైక్య అధ్యక్షురాలు ప్రమీల, వివోఏ పాలిక మమత, మండల కాంగ్రెస్ నాయకులు మేదరి టోనీ, భానోత్ హీరోలాల్, గుగులోత్ భీముడు ధారావత్ వినోద్ నాయక్, ఇమ్మడి తిరుపతిరావు, అడ్డగోడ ఐలయ్య, మల్లెల నాగేశ్వరరావు, తాజుద్దీన్, శ్రీను రెడ్డి, గౌస్ పాషా, దేగల ఉపేందర్, తోగర శ్రీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యాన్ని దొంగలించిన దుండగులు

### రేషన్ డీలర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు

**కల్లూరు, మార్చి 17 (ప్రజా జ్యోతి) :** నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని దొంగలించిన ఘటన మండల పరిధిలోని చిన్న కోరుకొండి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై డి హరిత తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం పౌరసరఫరాల గిడ్డంగి నుండి 117 క్వింటాల రేషన్ బియ్యం మొత్తం 234 బస్తాలు చిన్నకోరుకొండి గ్రామంలోని చౌక ధరల దుకాణం రెండు గదులలో నిల్వ ఉంచి,సోమవారం ఉదయం రేషన్ డీలర్ గుడిద బిక్షాలు రేషన్ షాప్ తీయడానికి వెళ్లగా తాళం పగలగొట్టి ఉన్నట్లుగా గుర్తించి లోపలికి వెళ్లి చూడగా15 బస్తాల బియ్యం మాత్రమే గదిలో ఉన్నాయని,దొంగిలించబడిన రేషన్ బియ్యం విలువ రూ. 2.4 లక్షలు ఉంటుందని రేషన్ డీలర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై హరిత పేర్కొన్నారు.

# మిస్టు కళాశాలలో 22 మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు



**సత్తుపల్లి, మార్చి17 (ప్రజా జ్యోతి) :** మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో గల మిస్టు అటానమస్ కళాశాలలో బెంగళూరు వారిచే స్కిల్ ఇన్ టర్నల్ ప్రైవేట్ లిమిటెడ్ వారితో విద్యార్థులకు ప్రాంగణా నియామకాలను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంగణా నియామకాలు ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు 22 మందికి అవకాశం కలిగింది. వీరికి సంవత్సరానికి 5.2 లక్షల వార్షిక వేతనంగా నిర్ణయించారు. బీటెక్ ఫైనల్ ఇయర్ కంప్లీట్ అయిన వెంటనే ఉద్యోగాల్లో జాయిన్ అవుతారు. ఈ కళాశాల నుంచి ఎంతోమంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు జరగటం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో చదివే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను, ఉపాధి అవకాశాలు దొరికేందుకు నైపుణ్యాన్ని అందిస్తున్నామని, వీరంతా ఉన్నతమైన స్థితిలో చేరుకొని పలువురికి ఉపాధి కల్పించే విధంగా ఉండాలని కోరారు.కళాశాల విద్యార్థులు ఎంపిక కావటం పట్ల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఏవి శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్,ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం వి రామచంద్రరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ టి రాఘవ రాజు వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు ఘనంగా అభినందించారు.

# మదర్ సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు చేయూత

### 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేత




**తిరుమలాయపాలెం, మార్చి 17, (ప్రజా జ్యోతి) :** మండలంలోని గోల్ తండా శివారు, జింకలగూడెం గ్రామానికి చెందిన సయ్యద్ మదర్ సాహెబ్ మరణించగా, తన తండ్రి పేరున కుమారుడు సయ్యద్ ఇమామ్ సయ్యద్ మదర్ సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. అప్పటినుంచి నిరుపేదలకు, తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు విద్య, వైద్యం మొదలగు కార్యక్రమాలు చేపడుతున్నారు, గత సెప్టెంబర్ లో వరద ముప్పున గురైన రాకాసి తండా వాసులకు నిత్యవసర సరుకులు ప్రతి సంవత్సరం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు అండగా ఉంటూ ఎన్నో సేవ కార్యక్రమాలు ట్రస్ట్ ద్వారా అందిస్తూ.. ఆదుకుంటున్నారు. సోమవారం జల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్ష రాసే విద్యార్థిని విద్యార్థులకు, మదర్ సాహెబ్ ట్రస్ట్ ద్వారా పరీక్ష కిట్లు అందించారు. ట్రస్ట్ కో-చైర్మన్ సయ్యద్ సిలార్, ట్రెజరర్ సయ్యద్ సైదా ఆధ్వర్యంలో జరిగిన ఈ యొక్క కార్యక్రమంలో మండల ఎస్సై కూచిపూడి జగదీశ్, ఎంఈఓ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని,60 మంది పదో తరగతి విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, జామిటర్ బాక్స్, పెన్నులకు సంబంధించిన కిట్లు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేష్ , షేక్ చందు, సయ్యద్ సైదా, సయ్యద్ అమీర్ సాబ్, సయ్యద్ అమీర్, ఉబేద్ తదితరులు పాల్గొన్నారు.

## గౌతమి ట్రస్ట్ ద్వారా సమాజ సేవలో కంపాటి బాబురావు, ప్రమీల దంపతులు.



**తిరుమలాయపాలెం, మార్చి 17, ప్రజా జ్యోతి :** మానవసేవే మాధవసేవ అని నిరూపిస్తూ సమాజ సేవలో గౌతమి విద్యాసంస్థల అధినేత కంపాటి బాబురావు, ప్రమీల దంపతులు. వ్యక్తిత్వం అంటే ఒకరు నిర్ధారిస్తే వచ్చేది కాదు.. ఒకరు కించపరిస్తే పోయేది కాదు అది మన నడవడిక, ప్రవర్తన, దాన్నెవ్వరు ఇవ్వలేరు, తీసుకుపోలేరు. అని నిరూపిస్తున్న గౌతమి ట్రస్ట్ ఎండి, కాంపాటి బాబు రావు పిండిప్రోలు గ్రామానికి ఎన్నో సేవలు అందిస్తున్నారు, కరోనా మొదటి వేలో, సెకండ్ వేలో ప్రజలందరూ ఇండ్లలో ఉండి బయటికి రాలేని పరిస్థితిలో కరోనా పేషంట్లకు నిత్యవసర సరుకులు పండ్లు అందించి తన గొప్పతనాన్ని చాటుకున్నారు, పిండిప్రోలు గ్రామంలో చర్చిలకు కూడా తన వంతు సహాయం చేసినారు , హిందూ దేవాలయాలలో కూడా ఎంతో అభివృద్ధి కి చేయూతనందించారు. కష్టకాలంలో ఉన్న పేద ప్రజలకు తనవంతు ఆర్థిక సాయం చేస్తున్నారు పిండిప్రోలు గ్రామానికి గౌతమి ట్రస్ట్ ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం కూడా జరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే గ్రామంలో స్కూల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట, అంబేద్కర్ ఆర్చి కి కూడా తన వంతు సాయం చేసినారు పిండిప్రోలు గ్రామపంచాయతీకి గౌతమి ట్రస్ట్ ద్వారా వైకుంఠ రథం ఏర్పాటు చేసి ఇవ్వటం జరుగుతుంది బాబురావు మాట్లాడుతూ మనిషి కి ఓపిక చాలా విలువైనది అది ఎంత ఎక్కువగా ఉంటే జీవితంలో అంత ఎక్కువ గా నేర్చుకుంటారు, ఒకరికి మన గర్వం చూపెట్టడానికి బదులు గౌరవించడానికి ప్రయత్నిస్తే మన గౌరవం కూడా పెరుగుతుంది అని తెలియజేశారు.

## కూసుమంచి రోడ్డు అద్దెకివ్వబడును..!

(మొదటి పేజీ తరువాయి)

బైపాస్ రోడ్డు పూర్తయిన తర్వాత పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తరణ జరుగుతుందని అందరూ ఆశించారు. గత ఎన్నికల సమయంలో మెయిన్ రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపడితే పట్టణ ప్రజలు ఓట్లు పోతాయేమోనని గత ప్రభుత్వం ఆలోచించింది. అందుకే ఆ విస్తరణ వాయిదా వేశారు. కానీ కొత్త ప్రభుత్వం వచ్చి ఇంతకాలం అయినా పట్టణ అభివృద్ధి గురించి ఏ మాత్రం పట్టింపు లేక ప్రణాళిక లేకుండా ఉన్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో విశాలమైన రోడ్డు, పట్టణ హైకానిక్ చిహ్నాలు ఏర్పాటు చేస్తూ ఇది మా ఊరు అని సగర్వంగా చెప్పుకునే పరిస్థితి అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్నప్పటికీ కూసుమంచి విషయానికొస్తే అది జరగడం లేదు. ఇక కూసుమంచి మారేది ఎప్పుడు? అని పట్టణానికి దూరంగా ఉన్న నివసిస్తున్న వాసులు వాపోతున్నారు.

వేసవి సెలవులకు ఇతర పండుగలకు దూర ప్రాంతాల నుండి స్వగ్రామానికి వచ్చిన పట్టణవాసులకి తరతరాలుగా కూసుమంచి ఇలానే ఉంది. ఇక కూసుమంచి మారదు అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కూసుమంచి మెయిన్ రోడ్డులో డ్రైనేజీలు ఆక్రమించుకొని ఈ రోడ్డు భాగాన్ని వాడుకున్నందుకు అద్దె ప్రాథమికంగా 20 వేల రూపాయలు పైనే కానీ తక్కువలో లేదు. ఇలా షాపు యజమానులు అక్రమంగా చేస్తున్న ఈ వ్యాపారానికి అధికారుల భయం లేదు అని అంటే ఇందులో అధికారులకు ఎంత అందుతుంది అనే విషయం దేవుడికి తెలియాలి. ఇలాంటి ఆక్రమణ వ్యాపారం వల్ల పట్టణంలో ప్రజలు పార్కింగ్ కూడా చాలా ఇబ్బంది పడుతున్నారు.రోడ్డు విశాలం చేస్తే పట్టణంలో పార్కింగ్ సమస్య పూర్తిగా తొలగిపోతుంది. యాక్సిడెంట్లు జరిగే అవకాశాలు తగ్గిపోతాయి. చూడటానికి పట్టణం చాలా అందంగా కూడా కనిపిస్తోంది. ఇలా రోడ్డు కూడా అద్దెకు ఇస్తూ అడ్డగోలుగా సంపాదిస్తున్నారంటే అధికారుల నిర్లక్ష్యం అర్థం చేసుకోవాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి, ఉన్న రోడ్డుని సక్రమంగా వాడితే చాలు. విస్తరణ సంగతి దేవుడు ఎరుగు అంటున్నారు. ఇక అధికారులు ఏం చేస్తారో వేచి చూద్దాం.



# ఆర్డీవోకి వినతి పత్రము అందించిన ఆశా వర్కర్లు



**కల్లూరు, మార్చి 17 (ప్రజా జ్యోతి) :** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేలు ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలనీ,ప్రమోషన్,పిఎఫ్, ఈఎస్ఐ,ఉద్యోగ భద్రత తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు సోమవారం ఆర్డిఓ కి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని,ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు అశా వర్కర్లు రాష్ట్రంలో నిరవధిక సమ్మె చేశారు.సమ్మె సందర్భంగా (ది. 09-10-2023న) హైదరాబాద్, కోఠి కమీషనర్ ఆఫీస్ ముందు వేలాది మంది ఆశా వర్కర్లతో ధర్నా నిర్వహించాం.ధర్నా సందర్భంగా ఆనాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశా యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపారు. కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారు.ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామని వేసిన కమిటీ ఆశాల సమస్యలను పరిశీలించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. హెల్త్ డైరెక్టర్ హామీ ప్రకారం అక్టోబర్ 9న ఆశా వర్కర్లు నిరవధిక సమ్మెను విరమించారు.వీటితో పాటు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీనిచ్చింది. 2024 ఫిబ్రవరి 9న,జూలై 30న, డిశంబర్ 10న ఆరోగ్య శాఖ కమీషనర్ ఆఫీస్ ముందు ఆశాల ధర్నా,చర్చల సందర్భంగా కమీషనర్ స్పందిస్తూ రూ.50 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని,మట్టి ఖర్చులు రూ.50 వేలు ఇస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్,సెలవులు ఇస్తామని, టార్గెట్స్ రద్దు చేస్తామని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారు. ఇతర సమస్యల పైన ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలియజేశారు.కానీ వాటిలో ప్రింటెడ్ రిజిష్టర్స్ ఇచ్చారు. స్పూటం డబ్బాలు మోయటం రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర సమస్యలు నేటికీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయలేదు. ఈ సమస్యలు పరిష్కారం చేయాలని అసెంబ్లీ ఎన్నికల నాటి నుండి నేటి వరకు ఈ సంవత్సర కాలంలో మంత్రులకు, ఎంఎల్ఎ లకు, ఉన్నతాధికారులకు ఆశాలు అనేక విజ్ఞప్తులు చేశారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో తీవ్రమైన ఆందోళనకు ఆశాలు గురవుతున్నామని,మా సమస్యలు పరిశీలించి,పరిష్కారం చేయాలని, విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గద్దల సమా ధానం వసంత తార నిర్మల కాటమ్మ సునీత జ్యోతి ప్రభావతి జమలమ్మ లక్ష్మీకాంత తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తెలంగాణ రాష్ట్ర గిరిజన సమైక్య ఖమ్మం జిల్లా పాలేరు డివిజన్ మహాసభను జయప్రదం చేయండి

## కూసుమంచి మండల అధ్యక్షుడు భూక్య వీరన్న

**కూసుమంచి, మార్చి 17 (ప్రజా జ్యోతి) :** కూసుమంచి మండలంలో గిరిజన సమైక్య సమితి సమావేశం నిర్వహించడం జరిగింది రేపు ఖమ్మంలో గిరి ప్రసాద్ భవనంలో జరిగే డివిజన్ మహాసభను జయప్రదం చేయాలని కూసుమంచి మండలంలో గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన ఒక ప్రకటన ద్వారా కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో భూక్య ప్రసాద్ భూక్య శ్రీకాంత్ భూక్య ప్రశాంత్ భూక్య వెంకట్ భూక్య కిషన్ భూక్యాపిక్లా తదితరులు పాల్గొనడం జరిగింది..



# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి

- వ్యవసాయ,రెవెన్యూ,ఆర్థిక శాఖ మంత్రులు ఉన్న రైతులకి ప్రయోజనం లేదు
- రైతు సంఘం మండల అధ్యక్షులు భూక్యా ప్రసాద్
- ఈనెల 20న వైరాలో జరిగే రైతు సంఘం జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



**కూసుమంచి, మార్చి 17 (ప్రజా జ్యోతి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అందరూ వ్యతిరేకించాలని, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల అధ్యక్షులు భూక్య ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రైతు సంఘం ముఖ్య నాయకులు సమావేశం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న భూక్య ప్రసాద్.. మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వం చేసిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని అయన డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సూచన మేరకు అన్ని రకాల పంటలకు, ఆయా ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలన్నారు. రైతు భరోసా పథకం అమలు అయ్యేందుకు వ్యవసాయ, రెవెన్యూ, ఆర్థిక శాఖల అవసరం ఉందని, ఈ మూడు శాఖలకు సంబంధించిన మంత్రులు ఉన్న రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందని విమర్శించారు. రెండు మూడు ఎకరాలలోపు ఉన్న రైతులకు కొందరికి మాత్రమే రైతు భరోసా డబ్బులు పడ్డాయి అని మరికొందరు రైతులకు రైతు భరోసా పడలేదని, దీనిపట్ల వ్యవసాయ అధికారులకు ప్రభుత్వం సూచనలిచ్చి వారికి కూడా రైతు భరోసా వచ్చేలా చూడాలన్నారు. షరతులు లేకుండా రైతులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.అలాగే రైతులకు పంటల బీమాను కల్పించాలన్నారు. ఈనెల 20న ఖమ్మం జిల్లా వైరాలో జరిగే రైతు సంఘం జిల్లా మహాసభలకు రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో భూక్య వీరన్న, బుక్య వెంకట్, భూక్య శ్రీకాంత్, ప్రశాంత్, కిషన్, నెహ్రూ, పిక్ల తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు వారాంతపు సంత రూ.45లక్షలు

## పాటను దక్కించుకున్న బజ్జూరి ఉపేందర్ రెడ్డి

## వేలం పాటలో పాల్గొన్న స్పెషల్ ఆఫీసర్ ఎంపిఓ రామచంద్రరావు



**కూసుమంచి, మార్చి 17 (ప్రజా జ్యోతి) :** కూసుమంచి మండల పరిధిలోని పాలేరు గ్రామంలో నిర్వహించే వారాంతపు సంతకు వేలం పూర్తయింది. సోమవారం ఎంపీవో రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి హరీష్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. కూసుమంచి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బజ్జూర్ ఉపేందర్ రెడ్డి అనే వ్యక్తి 45 లక్షల 16 వేలకు పాట పాడి పాలేరు సంతను దక్కించుకున్నాడు. గత ఏడాది రూ. 37.60 లక్షలకు ఉపేందర్ రెడ్డి కి పోగా, ఈ ఏడాది 8లక్షల 10వేలు అధికంగా వచ్చింది. ఈ ఏడాది కూడా అతనే పాటను దక్కించుకున్నాడు. ఉదయం 11 గంటల లోపు 19 మంది సభ్యులు ఒక్కొక్కరు లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి, రసీదు పొందారు. తొలుత 25 లక్షలతో ప్రారంభించి మధ్యాహ్నం 12 గంటల లోపు రూ. 45,16000 వేలకు ధర పలికింది. అత్యధికంగా వేలం పాడిన బజ్జూర్ ఉపేందర్ రెడ్డి పాలేరు సంతనం దక్కించుకున్నట్లు. కూసుమంచి స్పెషల్ ఆఫీసర్ ఎంపీఓ రామచందర్ రావు ప్రకటించారు. పంచాయతీ కార్యదర్శి హరీష్, గ్రామ పెద్దలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# తెలుగు విశ్వ విద్యాలయమునకు పొట్టి శ్రీరాములు పేరును పునరుద్ధించాలి - ఆర్.జె.సి. కృష్ణ

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** ఖమ్మం ఆర్.జె.సి., కళాశాల ఆవణలో 3 టౌన్ కార్పోరేటర్స్ మరియు ఇతర ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల సందర్భములో వారి పేరును తొలగించి ఆర్యవైశులను అవమాన పరిచారని తెలియజేసారు. ఆంధ్రుల పేరు మీద ఉన్న పార్కులు మరియు స్టేడియంల పేర్లను మార్చగలరా, ట్యాంక్బండ్పై ఉన్న ఆంధ్రుల విగ్రహాలను తొలగించగలరా అని ప్రశ్నించారు. ఖమ్మంలో ఉన్న ఆర్యవైశుల మనోభావాలు దెబ్బతినేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తించిందని, ఇప్పటికైన ఈ తప్పును తెలుసుకొని తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్స్ తోట వీరభద్రం, మాటేటి నాగేశ్వరరావు, రవి నాయక్, శ్రీకాంత్, పాపారావు, ముక్కాల రాజేష్, బోజడ్ల రామమోహన్, యార్రా అప్పారావు, పసుమర్తి రామమోహన్, తదితరులు పాల్గొన్నారు.

